
కళింగ నగరిలో
ఈజిప్టుసుందరి
భాను ప్రకాశ్

**Kalinganagarilo Egyptu Sundary**
*Egyptian Lady in Kalinga Nagari*
by **Bhanu Prakash**
© Author
ISBN: 9788193276556
**Sikkolu Book Trust**
2018

కళింగనగరిలో ఈజిప్టు సుందరి

**భానుప్రకాశ్**

© పూర్తి హక్కులు రచయితవే

జూన్ 2019

వెల: రూ. 108

కవర్ డిజైన్: షన్ముగవేల్

లేఅవుట్ : సి. రాజశేఖర్

ప్రచురణ:

**సిక్కోలు బుక్ ట్రస్ట్**

ఎంఐజి 100, ఏపిఎచ్‌బి కాలనీ, శ్రీకాకుళం - 532 001

సెల్: 9989265444

ప్రతులకు :

**భానుప్రకాశ్**

సెల్ : 9611538423

SBT

ISBN 978-81-932765-5-6
9 788193 276556

# కళింగ నగరిలో ఈజిప్టు సుందరి

## భాగం - 1

గౌతమ బుద్ధుని కాలానికి కొన్ని వందల ఏళ్ళ ముందు. అది కళింగపట్నం మహానగరం. వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. వంశధార గాలులు సముద్రపు హోరుతో కలిసి సరికొత్త రాగాల్ని చిలుకుతున్నాయి. తీరప్రాంత మంతా వచ్చే పోయే వర్తకులతో చాలా చాలా సందడిగా ఉంది. మధ్య కళింగంలో శ్రీముఖ లింగం రాజధాని నగరమైతే కళింగపట్టణం ప్రధాన వర్తకనగరం. అతిప్రాచీన ఓడరేవు కూడా. నిత్యం విదేశీ వర్తకులతో, స్వదేశి వ్యాపారస్తులతో కళకళలాడుతూ నాట్యంచేసే ఊరు గ్రీకు, బాహ్లిక, సుమత్రా, జావ, సిమ్హళ, ఈజిప్ట్ దేశాల నుంచి ఓడలు వచ్చే రోజున మరింత ఒళ్ళు విరుచుకుని నాట్యంచేస్తుంది. వాతావరణ అనుకూలతలు, రాజకీయ కారణాలు, వర్తక వ్యాపారాల దృష్ట్యా ఈ రాజధాని నగరాలు మారుతూ ఉంటాయి. ఈజిప్ట్ ఓడను లంగరు వేయించి ప్రధాన నావికా దళపతి ఆ రోజు స్వయంగా కళింగ నగరి చేరుకున్నాడు. దుబాసి (ట్రాన్స్‌లేటర్)

చూచాయిగా అతని రాక గురించి అక్కడ ఉన్న రక్షక భటులకి తెలియజేసారు. వారి ముఖాలు ఒక్కసారిగా ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఆయనని అక్కన్నుంచి అటే సకల లాంచనాలతో రాజమందిరానికి తీసుకునిపోయారు. ఎందుకో ఆరోజు పైడేశ్వరాలయంలో నంది విగ్రహంపై పట్టపుటేనుగు పుష్ప వర్షం కురిపించింది.

అప్పటికి కొంత కాలంక్రితం సీతమ్మగూడేం (సీతంపేట) గ్రామం. చుట్టూ అతి దట్టమైన అడవులు. ఇవి నల్లమల అడవుల కన్నా చిక్కగా ఉండేవి. సకల జీవరాశులతో అత్యంత పుష్టికరమైన కలపతో, ఎన్నో సహజ సిద్ధమైన సుగంధ ద్రవ్యాలతో అన్నిటికన్నా ముఖ్యంగా ప్రపంచంలోనే అత్యంత బలమైన గజసంపదతో అలరారుతూ ఉండేవి. ఏనుగుల గుంపు ఆ ఊరి మీదకి దండెత్తి వచ్చి వాళ్ళ పంటలని మొక్కల్ని నాశనం చేస్తుంటే ఏనుగుల వేటగాడైన భూమడు అత్యంత చాకచక్యంగా వాటిని, వాటి కోసమే సిద్ధం చేసిన గోతిలో పడవేసి రాజ ప్రతినిధులకి అమ్మాడు. దానికి బదులుగా భూమడికి పెద్దమొత్తంలోనే సంవత్సరానికి సరిపడా ఆహారధాన్యాలు, సుగంధద్రవ్యాలు, విదేశి వర్తకానికై అనుమతి పత్రం (వీసా) లభించాయి. ఎందుకంటే మధ్య కళింగానికి గజబలం అత్యంత ప్రధానమైనది. దానిని అభివృద్ధి చేయడానికి రాజు ఏం వెచ్చించడానికైన సిద్ధమే. అలా ఒక ఏనుగుల గుంపుని రాజుగారికి అప్పజెప్పి వాటిని మచ్చిక చేసి యుద్ధానికి బరువులు మొయ్యడానికి సిద్ధం చేయడం భూమడి కుటుంబంలో తరతరాలుగా వస్తున్న వృత్తి. ఆరోజు కూడా భూమడు అలానే చేశాడు. కాని అందులో ఒక ఏనుగు తన జాతకాన్నే మార్చేస్తుందని భూమడికి అప్పటికి తెలియదు.

# భాగం - 2

సీతమ్మగూడేం నుంచి కళింగనగరి చేరేసరికి సుమారు పదిహేను రోజులు పట్టింది భూమడికి. ఈలోపు ఏనుగులన్ని తనకి చాలా మచ్చికైపోయాయి. అందులో ఒక ఏనుగుకు వినాయకం అని పేరు పెట్టుకున్నాడు భూమడు. అదంటే భూమడికి ఎందుకో చూడగానే ఇష్టం కలిగింది. భూమడు ఏనుగులతో కలిసి పైడేశ్వరాలయం దగ్గర నిద్రపోయాడు. ఆరోజు వినాయకం మాత్రం అలా అక్కడున్న ఆ మహానంది విగ్రహాన్నే చూస్తూ ఉండిపోయింది. పడుకోలేదు. తెల్లరే సరికి దానిని స్నానం చేయిస్తుంటే తొండం నిండా నీళ్ళు పీల్చి మహానంది పై చిమ్మింది. ఆ విగ్రహమేమో ఏనుగుకి కూడా అందనంత ఎత్తులో ఉంది. అయినా దాని ధాటికి నంది తడించింది. గుడిలో గంటలు ఒక పెద్ద సముద్రపు గాలికి టంగుమని మోగాయి. ఓడలు బంగళాఖాతం మీదుగా బయలుదేరి సిమ్హల దేశం చేరి అక్కన్నుంచి హిందు మహాసముద్రం అరేబియ సముద్రం మీదుగా ఎర్ర సముద్రం చేరి ఈజిప్టుకు చేరుకుంటాయి. అక్కడ వస్తు వినిమయం లేదా ఈజిప్టు బంగారు నాణేల ద్వారా వ్యాపారం సాగిపోతూ ఉంటుంది. అరేబియన్ గుర్రాల కోసం ఇక్కడ నుంచి ఏనుగులనో ముత్యాలనో, లేదా భారీ మొత్తంలో సుగంధ ద్రవ్యాలనో ఇవ్వడం చాలారోజులుగా వస్తున్నదే. ఈసారి అశ్వదళం పెంచుకోవడం కోసం కొన్ని ఏనుగులను కూడా విదేశాలకు పంపిస్తున్నారు. అందులో అస్సలు నైపుణ్యంలేని

ఈ కొత్తగా దొరికిన ఏనుగుల గుంపు ఎన్నుకోబడింది. నాసిరకం సరుకు వదిలించుకోవడమేగా వ్యాపారస్తుల లక్షణం. బలంలో అజేయమయిన వైనా నైపుణ్యం లేకపోవడం వాటి ప్రయాణానికి కారణమై కూర్చుంది. ఇక కదలక తప్పదు. అది ఏదేశమైనా. కాని కళింగదేశం మోసపూరిత వ్యాపారం ఎప్పుడు చెయ్యదు. విషయం తెలిసిన నావికాధికారి అప్పటికప్పుడు భూమడ్ని బయలుదేరించి ఏనుగుల శిక్షణకై తమతో పాటు తీసుకెల్లాల్సి వస్తోంది. ఒక దళారి మోసం భూమడిపై పడింది. కాని ప్రయాణం కట్టిన భూమడికి ఇవేవి తెలియదు. రాజాజ్ఞ అంతే, అంతవరకే తెలుసు. నువ్వు చెయ్యని తప్పుకి నీకే తెలియకుండా నువ్వు శిక్ష అనుభవిస్తున్నప్పుడు దైవం నీకోసం ఏదో వరం దాచే ఉంచుతుంది.

వినాయకం కళింగ నగరిలో ఓడ ఎక్కడానికి గొప్ప మారం చేసింది. ఎంత సేపు ఆ నంది విగ్రహం వైపు ఆనందంగా చూసి తొండం ఎత్తి ఘీంకరిస్తుందే తప్ప ఓడ ఎక్కడానికి అస్సలు ఒప్పుకోవట్లేదు. దానితో రాజాజ్ఞపై భూమడు ఈజిప్ట దేశానికి ప్రయాణమయ్యాడు. ఎందుకంటే ఈజిప్టుతో వ్యాపారం ద్వారా రాజుకు వచ్చే ఆదాయం లక్షల్లో ఉంటుంది. కాని పోయే వస్తువులు ధర మాత్రం వందల్లో. అందుకనే కళింగనగరికి విదేశి వ్యాపారం వల్ల కోట్లలో ఆదాయం వచ్చి యావత్ కళింగ సామ్రాజ్యానికే ఆయువుపట్టుగా ఉండేదా నగరం. ఈ కారణం చేత రాజు ఆ వ్యాపారానికి ఏమాత్రం అడ్డువచ్చినా సహించడు. దాని వల్లనే భూమడు తన జీవితంలో మొట్టమొదటి విదేశీయానం చేయవలసి వచ్చింది. ఎందుకంటే ఆ ఒక్క ఏనుగు మొరాయించడం వల్ల ఏనుగుల గుంపులన్ని మొరాయించే ప్రమాదం ఉంది. ఇప్పుడిక ప్రయాణానికి అంతా సిద్ధం. భూమడి మనసులో ఒక రకమైన ఉత్సాహం ఉద్వేగం భయం... అక్కడ వంశధారా నది సముద్రంలో కలిసినట్టుగా ఒక దానిలో ఒకటి కలిసి పోతున్నాయి. అది తన ముఖం మీద ప్రస్పుటంగా

కనిపిస్తుంది. సీతమ్మ గూడేం కుర్రవాడికి ఆ సముద్రపు ఉప్పటి పవనం చెంపను తాకింది. వెచ్చగా తన జీవితంలో మొట్టదటి సారిగా. అదెందుకో అతనికి సుదూర దేశపు సాగర సాదర ఉదార ఆహ్వానంలా అనిపించింది.

నిజానికి భూమడి ప్రయాణం సీతమ్మ గూడేం నుంచి కళింగ నగరి వరకే అనుకున్నాడు. కేవలం వినాయకం మొండిపట్టు వల్లే తనకీ ప్రయాణం అనుకున్నాడు. తన ప్రయాణం ఈజిప్టు వరకు నావికాధిపతి ముందే నిశ్చయించినట్టు ఆ పల్లెటూరి వీరుడి బుర్రకి ఎలా తడుతుంది.

# భాగం - 3

ఓడ ప్రయాణం మెల్లగా సాగుతోంది దారిలో వచ్చే ద్వీపాలను ద్వీప కల్పాలను చూసుకుంటూ సాగుతున్న ప్రయాణం భూమడికి చాలా ఆహ్లాదంగా ఉ ంది. తను ఎప్పుడూ చూడని దూర దేశాల మనుషులను వారి నాగరికతలను చూస్తూ భూమడు తన జీవితంలో ఎప్పుడూ ఎరుగని అద్భుత ఆశ్చర్యానందాలకి లోనయ్యాడు. బంగాళాఖాతం మొదటలో అలలు పెద్దవిగా ఉన్నా తరువాత తరువాత చాలా ప్రశాంతంగా ఉంటుంది. వాతావరణం కూడా అకస్మాత్తుగా మారకుండా సముద్రం ఎప్పుడు ధ్యానంలో మునిగినట్టు గుంభనంగా ఉంటుంది. అరేబియ సముద్రం అలా కాదు. కాస్త కల వర పాటు ఎక్కువ. ఉండి ఉండి తుళ్ళి తుళ్ళి పడుతుంది. కెరటాలు కూడ రాకాసి మోరలు తెరచి ఓడ బలానికి పరీక్ష పెడుతుంటాయి. ఈ సముద్రంలోకి ఓడ చేరగానే తనకి అర్థమైపోయింది సముద్రం అన్నిచోట్లా ఒకేలా ఉండదని. కాని ఇందులో ఇంకో విషయం ఉంది. ఆ రోజు తనతో పాటు చాలా భారీగా వస్తు సంపద ఉండడం వల్లన తను బయలు దేరిన ఓడ మధ్యలో మారదు. ఒకే ఓడ కళింగ నగరం నుంచి ఈజిప్టు వరకు అప్రతిహతంగా ప్రయాణిస్తూనే ఉంటుంది. అప్పటికే ఆ ఓడ బయలుదేరి 45 రోజులు కావచ్చింది.

ఆ రాత్రి భూమడికి నిద్రపట్టలేదు. ఆకాశంలో చుక్కలు సముద్రంలో చేపలు ఒకదానితో ఒకటి అందంలో పోటీపడుతున్నాయి. మెత్తని మేఘాలు అక్కడక్కడ

చెదిరి చెదిరి ఉన్నాయి. భూమడి కళ్ళు ఆ మేఘాల మధ్యలో నుంచి ఉన్న సగం చంద్రుడు పై పడ్డాయి. అదిగో అప్పుడే అకస్మాత్తుగా చంద్రుడి పక్కగా ఒక చిన్న నక్షత్రం తన జీవితం చరమాంకాన్ని ఉల్కగా రాల్చుకుంది. దూరపు దీవిలో పెద్ద తోడేలు గట్టిగా ఊల పెట్టింది. ఏదో అపశకునం తోచిన భూమడి మనసు ప్రమాదాన్ని పసిగట్టింది. ఓడ పక్కగా ఆడుకుంటున్న డాల్ఫిన్ చేపలు పరుగు పరుగున పారిపోయాయి. అక్కడి వాతావారణంపై యుద్ధపు మేఘాలు కమ్ముకున్నాయి. చాలా దూరంగా కారు చీకట్లలో మదమెక్కిన ఏనుగుల గుంపులా ఒక పెద్ద చీకటి కొండలా, చిట్టడివిలో వేట కోసం ఒక్కొక్క అడుగు వేసే చిరుత పులిలా వీళ్ళనే సమీపిస్తుందో ఓ పెద్ద ఓడ. భూమడు అప్రమత్తుడై తన చిక్కానికి ఉన్న కొమ్ముబూరని ఒక్కసారిగా గట్టిగా ఊపిరంతా ఎగపీల్చి ఊదాడు. అంతక ముందు నక్క ఊలకే కాస్త నిద్రలోంచి బయటకి వచ్చిన సరంగులంతా ఒక్కసారిగా నిద్రలేచారు. అందరు ఏమయ్యిందని భూమడ్ని సమీపించారు. భూమడు అతిదూరంగా ఉన్న ఆ ఓడ వస్తున్నవైపే చూపించాడు. అందరూ ఎంత కళ్ళు పెద్దవి చేసి చూసినా అది వారికి కనపడలేదు గాని అలల కలకలం మాత్రం తెలుస్తూనే ఉంది. ఓడపైన సైన్యమంతా అప్రమత్త మయ్యారు. దూరదర్శినితో చూసేసరికి చూచాయగా కనుచూపు మేరకి కాస్త ముందుగా కనిపించింది కపాలపు గుర్తు జెండా ఉన్న సముద్రపు దొంగల ఓడ.

నావికా దళపతి భూమడి వైపు మెచ్చుకోలుగా చూచి వీల్లకి ఇన్నాళ్ళకి మన మీద కొచ్చే ధైర్యం మళ్ళీ వచ్చిందన్నమాట అని అన్నాడు. దానికి భూమడు మళ్ళీ రావడమేంటి అనగానే మన కళింగసేనలకి ఈ దారి దోపీడీదార్లు కొత్తకాదు. వీళ్ళు అవకాశం కోసం ఎన్నో ఏళ్ళుగా కాచుకు కూర్చున్నారు. మనం గత కొన్నేళ్లలో ఎప్పుడూ లేని సంపదలతో సంచ ద్వీపానికి బయలుదేరాము, ఈజిప్టును భారతీయులు సంచ ద్వీపం అని కూడా అనేవారు. మనం ఎప్పుడు వ్యాపారం చేసినా అరబ్బుల

సహాయమో లేదా రోమన్ల సహాయమో తీసుకుని వ్యాపారం చేసే వాళ్ళం. కాని గత కొన్ని ఏళ్ళుగా సొంతంగా వారితో వ్యాపారం సాగిస్తున్నాం. అది కూడా సముద్ర మార్గం గుండా. అరబ్బులతో ముందు మనకి లావా దేవీలున్నాయి కాబట్టి వీళ్ళు ఇన్ని రోజులు వాళ్ళకి భయపడి మన ముందు వెళ్ళిన ఏ ఓడలని అడ్డుకోలేదు. అరబ్బుల రాజతంత్రంలో ఏదో మనకి ప్రతికూలమైన మార్పు వచ్చినట్లుగా తోస్తుంది. అందుకే వీళ్ళు ఇంత సాహసానికి ఒడిగట్టారు. అయినా వీళ్ళని చీల్చి చెండాడం కళింగసేనలకి కొత్తకాదు. కాక పోతే వీళ్ళు విజయం కోసం ఎంత నీచానికైనా ఒడిగడతారు. ఇప్పుడు వీళ్ళకి మనం కొట్టే దెబ్బ ఎలా ఉండాలి అంటే అరేబియ న్రాజులు మనం అడగకుండానే మనకి సంజాయిషీ ఇవ్వాలి. ఈ రోజు ఆ దెయ్యాల ద్వీపపు తోడేల్లకి విందు పసందుగా ఉండబోతుంది. ధ్వంస రచన చేసే సమయం కళింగపట్టపురాణికి ఒకప్పుడు జరిగిన అవమానానికి మరోసారి ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఆ పైడెశ్వరుడే నాకు మళ్ళీ ఇచ్చాడు అని దళపతి ఆవేశంగా భూమడితో అన్నాడు.

ఇంతలో ఒక ఆరడుగుల మనిషి “అల వక్త్ ఇలిహుజుం”, అంటే దాడికి సరైన సమయం ఇదే అని అర్థం, అని గట్టిగా తన దగ్గర ఉన్న బూరలో అరిచి సముద్రంలో గెంతేసాడు. ద్రో........హి.......

# భాగం - 4

## సముద్రపు దొంగలతో పోరు

సముద్రంలోకి దూకిన మనిషి చక చక ఈదుకుంటూ వస్తున్న నావవైపే వెళ్లిపోయాడు. నావలో దొంగలు పెద్దగా మెచ్చుకోలుగా అరుస్తూ అతన్ని తాడు వేసి పైకి లాగారు. ఇక యుద్ధ భేరి మోగించండి అని చెప్పగానే సైనికులంతా యుద్ధానికి సిద్ధమవుతూ యుద్ధ భేరిని మోగించారు. భూమడికిది తన జీవితంలో మొదటి యుద్ధం. అదీ సముద్రం పైన చూడబోతున్నాడు. అతనికి అడవి జంతువులను వేటాడడమే గాని, కొంతమంది మనుషులు ఇలా మరికొంతమందిని దోచుకోవడానికి అడవి జంతువుల కన్నా ఓపికగా వేచి ఉంటారని అతను ఎరుగడు. ధనుర్ధారులందరూ కళింగనగరి ఓడ పై సిద్ధంగా ఉన్నారు. వాళ్ళని సిద్ధంగా ఉండమని చెప్పి దళపతి కొన్ని చిన్న చిన్న పడవల్లో గుంపులు గుంపులుగా కొంత మంది సైనికులని ఒక చాపంలా అటు ఇటూ ఓడకి కుడి ఎడమలుగా నిలబెట్టి ఉంచాడు. సముద్రపు దొంగలకి మోటు యుద్దమే గాని నైపుణ్యం తెలియదు. యుద్ధతంత్రాలన్నీ సైన్యాధ్యక్షులకే తెలుస్తాయి గాని దొంగల నాయకులకి కాదు. అయినా ఇలాంటి యుద్ధాలలో వారిది పైచెయ్యి అవుతూ ఉంటుంది. దానికి కారణం స్థానబలం. ఆ ప్రాంతపు ఆనుపానాలు తెలియడం.

సముద్రపు దొంగలు దగ్గర పడుతున్నారు, భూమడి గుండెల్లో అడవి గుర్రాలు పరిగెడుతున్నాయ్. దళపతి మాత్రం నిశ్చింతగా ఉన్నాడు. ఎంతైనా యుద్ధ రీతుల్లో తలపండిన వాడుకదా. కాని మనం విశ్వాసంగా ఉన్నప్పుడే అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. గుంపులు గుంపులుగా ఉన్న పడవలు ఓడకి కాపుగా ముందు వెళ్తున్నాయి. అవన్నీ ఒకే రకమైన ఆకారంలా ఏర్పడి వెళ్తుండడం సముద్రపు దొంగలకి కాస్త సంశయం ఏర్పడి సైన్యం అంతా వస్తుందేమో అన్న భయంతో చీకట్లో ఇంకా ఆ మసక వెన్నెల్లో సరిగ్గా కనపడక మొదటి దాడి చేసారు వాళ్ళ దగ్గరున్న విషపు బాణాలతో.

దళపతి పాచిక పారింది బాణాలు వచ్చే దిశ, కోణాన్ని బట్టి ఓడ దూరాన్ని అక్కడున్న విలుకాళ్ళ స్థానాన్ని అంచనా వేసి, కొన్ని ధ్వని సౌజ్ఞల ద్వారా చిన్న పడవల్ని వారి వారి స్థానాల్లో ఉంచి ఓడ మరియు ఆ చిన్న పడవలని షడ్భుజాకారంలో పెట్టాడు. ఇప్పుడు ఈ షడ్భుజంలో అన్ని రేఖలు పైనున్న ఒక బిందువును కలవాలిగా, అదే ఆ బిందువే సముద్రపు దొంగల ఓడ. దళపతి దాడి చెయ్యండి అని అరవగానే ఓడ నుంచి చిన్న పడవల నుంచి ఉన్న సైనికులంతా ఒకేసారి బాణ వర్షం ఆ ఓడవైపుగా గురి పెట్టి సంధించారు. ఆ ధాటికి ప్రత్యర్థుల ఓడ అంతా బాణాల ధాటికి ముళ్ళ పందిలా తయారయ్యింది. అటువైపు చాలా ప్రాణనష్టం జరిగింది. ఇక గెలుపు తమదే అన్న ధీమాలో కళింగనగరి సైన్యమంతా జయజయధ్వానాలు చేసింది. కాని జయాపజయాలు దైవాధీనాలు, ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. చాలాసేపు నిశ్శబ్దం. రెండు ఓడలు బాగా సమీపిస్తున్నాయి.

సరిగ్గా అప్పుడు దొంగల నాయకుడు అతిఎత్తైన ఆ జెండా స్థంభం పైన నిలబడి ధీమాగా ఒక్కసారి సముద్రమంతా పరికించి చూసాడు. దళపతికి వాడి ముఖం చూడగానే పాత సంఘటనలన్నీ ఒక్కసారిగా మెదిలాయి. ఇద్దరు ఒకర్నొకరు

పోల్చుకున్నారు. ఆ ఒంటికన్ను నాయకుడ్ని చూసి దళపతి కళ్ళెర్ర చేశాడు. మర్యాదగా లొంగిపొమ్మనీ దళపతి అరిచాడు. కాసేపు అలాగే ఆగి తమీం తన ఒరలోని కత్తిని తీసి దళపతివైపుకి చూపించాడు. అలానే చూపిస్తూ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వుకి అర్థం ఆ నవ్వు పూర్తయిన సెకనులో వెయ్యో వంతుకు దళపతికి అర్థమయ్యింది. వెనక నుంచి ఇంకో సముద్రపు దొంగల ఓడ వీళ్ళపై దాడికి సిద్ధంగా ఉంది. అది ఇందాక యుద్ధం జరుగుతున్నంత సేపు తిమింగలంలా మెల్లగా వీళ్ల వైపుకె ఆక్రమిస్తూ వస్తోంది. దళపతి ముఖం వివర్ణమైపోయింది. దళపతి ముఖం చూసిన భూమడు దొరా ఇప్పుడెలా అన్నాడు. దళపతి అతివిశ్వాసంతో తప్పు చేసాననిపిస్తుంది. ఇప్పుడు మనం గెలవడం అసాధ్యంలా అనిపిస్తుంది అని అనగానే భూమడికి తన గూడేంలో చిన్నపిల్లల్ని ఎత్తుకెళుతున్న తోడేళ్ళ గుంపు గుర్తుకు వచ్చింది. దొరా మా గూడేంలో ఇలానే తోడేల్ల గుంపు మేము అటు వస్తే ఇటు కాచి ఇటు వస్తే అటు కాచి ఉక్కిరిబిక్కిరి సేసినాయి దొరా. అప్పుడూ సీతమ్మగూడేంమా ముసలయ్య తాత సెప్పినాడు ఒరె అసలు దాన్ని ఒగ్గేసి మీరు కొసరు నక్కల్ని ఎన్ని సంపినా అవి మళ్ళా మళ్ళా వస్తాంటాయిరా అనె. అప్పుడు మేము కొన్ని రోజులు కాపు కాసి ఆ నక్కల మొగనాల్ని కనిపెట్టినాం. ఈపాలి ఈ నక్కలు ఇటు రాగానే మేము అక్కడ ఆ మొగనాలి నక్కని దుడ్డుకర్రతో సావాసితక్కొట్టినాం. అది మోరెత్తి ఒక నాగ కూసినాది. దెబ్బకి ఎక్కడి నక్కలు అక్కడనే ఊరొదిలి పారిపోయినాయి. ఆ నక్కనే అక్కడ సంపిపాతి పెట్టినం. ఆసారి నుంచి ఒక్క నక్క మా గూడేం వైపు సూత్తే ఒట్టు అని చెప్పాడు. దానికి దళపతి పెద్దగా నవ్వి ఇది నక్కలతో ఆట కాదురా భూమ. అంతకన్నా ప్రమాదకరమైన మనిషితో అన్నాడు. దానికి భూమడు ఇలా దొంగదెబ్బ తీసే మనిషి నక్క కన్న నీచెపు నా కొడుకు దొరా, అని నాకొక్క అవకాశం ఇయ్యి దొరా. ఆడ్ని సంపైనా నేను సచ్చయినా రాజుగోరి ఋణం తీర్చుకుంటాను అన్నాడు.

దళపతి ఆలోచించి సరే ఏంచెస్తావో చెయ్యి. నేను మాత్రం నా రీతుల్లోనే పోరాడుతా. ఇదిగో ఈ పదిమంది సైనుకులు నీ అధీనం. నువ్వెలా చెబితే అలా చేస్తారు. నువ్వు తమీంగాడి పనిచూడు, నేను ఆ వస్తున్న ఓడని అడ్డుకుంటా అన్నాడు. అప్పుడు భూమడు దొరా ఈళ్ళతో నాకు పనికాదుగాని నా వినాయకంని ఇక్కడికి తీసుకు రానివ్వండి చాలు అన్నాడు. ఆ వ్యూహాన్ని అనుమానిస్తూనే అసలు అవి నీకు మచ్చికై కొన్ని రోజులు కూడా కాలేదు దానితో నువ్వేమి చేస్తావు అన్నాడు. దానికి భూమడు దొరా మా నీలమ్మ తల్లి మీద ఆన. ఒక్కసారికి నమ్ము నీ పనిలో నువ్వుండు నా పని నేను సక్కపెడతా అన్నాడు. చేసేదిలేక సరే అని వినాయకాన్ని తెప్పించాడు. వినాయకం భూమడ్ని చూడగానే ఆనందంగా తోక ఊపుతూ వచ్చింది. అక్కడ తమీం సమీపిస్తున్న ఓడలో ఏనుగును చూసి ఈడేమైనా గారడీవాడా అని తనలో తనే నవ్వుకుంటున్నాడు. భూమడు ఏనుగుపై ఎక్కి రెండు ఓడలు ఎప్పుడు దగ్గరవుతాయా అని చూస్తున్నాడు. ఇంతలో ఒక బాణం తమీం వైపు నుంచి ఏనుగుపైకి దూసుకొస్తోంది.

ఆ బాణం వినాయకం కుంభస్థలానికి గురిపెట్టింది. అది ఏనుగును సమీపిస్తుండగా, ఏనుగుపై ఉన్న భూమడు తన ముల్లుగర్రతో పక్కకు తప్పించాడు. అది పక్కకి జరిగి ఓడచెక్క నేలపై గుచ్చుకుంది. అది చూసిన దళపతి “శభాష్ రా భూమ. నిన్ను నేను నమ్మవచ్చు” అని వస్తున్న రెండో ఓడ వైపుకి పరిగెత్తాడు. కాని వెళ్ళే ముందు “భూమా! నా అనుభవంతో చెబుతున్నా విజయం మనకి దగ్గర్లో అయితే లేదు. కాని చివరిదాకా పోరాడదాం. ఒకవేళ ఓడిపోతే ఈ సంపదనంతా ఇక్కడే జలసమాధి చేశేద్దాం. ఎందుకంటే ఇంత సంపద ఈ దొంగల చేతిలో పడితే వీళ్ళు కొన్ని దేశాలనే దోచేస్తారు. విజయమో వీరస్వర్గమో జై కళింగమాతా” అని దళపతి యుద్ధానికి సిద్ధం అయ్యాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Kalinga+Nagarilo+Egypt+Sundari](http://kinige.com/book/Kalinga+Nagarilo+Egypt+Sundari)**

* * *